ప్రజాశక్తి

బుధవారం 9 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రైల్వేజోన్ ఆశల పల్లకేనా!

- కాలయాపనకు బ్రేక్ పడేనా?
- సిఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ఏం జరిగింది?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఊరిస్తూ వస్తోంది. ఎన్నో ఏళ్లనాటి ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల కల సాకారమవుతున్నట్టే అనిపిస్తున్నా ఆచరణలో మాత్రం ఎలాంటి అడుగూ పడడం లేదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్రం ఆపేసిందంటూ జరిగిన ప్రచారం లాంటిదేనా ఈ రైల్వేజోన్‌పై సాగుతున్న తాజా ప్రచారం అన్న చర్చ జోరుగా సాగుతోంది. 2016నుంచి కేంద్రంలోని బిజెపి సర్కారు పెద్దలు ప్రధాని మోడీ సహా దీనిపై ఏటా ప్రకటనల ప్రహసనం సాగిస్తూనే ఉన్నారు. ప్రధాని మోడీ వస్తారంటూ, శంకుస్థాపన చేస్తారంటూ రాష్ట్ర బిజెపి నేతలు 4 ఏళ్లుగా హడావుడి చేస్తూనే ఉన్నా ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

తీవ్ర కాలయాపనతో బిజెపి పబ్బం

జోన్ ఏర్పాటు విషయమై కాషాయ సర్కారు తీవ్ర తాత్సారాన్ని కొనసాగిస్తూనే ఉంది. తాజాగా ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రం దీనికి పచ్చ జెండా ఊపిందంటూ ప్రకటన చేయడంతో ఇది మరలా ఆశల పల్లకి మాత్రమేనా అనే చర్చలు వాల్తేరు రైల్వేలో వినిపిస్తున్నాయి. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ ఏడాది డిసెంబర్‌లో విశాఖ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేయనున్నారంటూ ప్రకటనను ఢిల్లీ నుంచి చంద్రబాబు విడుదల చేయడం చూస్తే రైల్వే జోన్ ఏర్పాటులో కదలిక మొదలైందా? అన్నది పలువురిలో చర్చనీయాంశమైంది. అయితే కేంద్ర ప్రభుత్వం గానీ, రైల్వే మంత్రి సైతం దీనిపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనించదగినది. డిసెంబరులో శంకుస్థాపనకు ప్రధాని అంగీకరిస్తే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి విశాఖ రైల్వేకు సూచన ప్రాయంగానైనా సమాచారం వచ్చి ఉండేదని సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి. ఐనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైల్వే స్టేషన్ల రీ డెవలప్‌మెంట్‌కు, వాటికెక్కడ స్థలాలున్నాయో అన్వేషణలో పడింది. కేంద్రం రైల్వేలను ప్రైవేటీకరించేందుకు నిర్ణయించిన ప్రస్తుత నేపథ్యంలో కొత్త రైల్వే జోన్‌పై సుముఖంగా ఉన్నట్టు అనిపించినా ఆచరణలో పనులకు ఓకె చెబుతుందా? అన్నది అనుమానమేనని రైల్వే ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది.

జనరల్ మేనేజర్ పోస్టు భర్తీ ఎప్పుడు?

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో పలుమార్లు ప్రకటించిన బిజెపి ఇంతవరకూ జనరల్ మేనేజర్ పోస్టు భర్తీకి సైతం చొరవ చేయకపోవడం చూస్తే ఈ ప్రకటనలను నమ్మొచ్చా? ఎందుకంటే ఇప్పటికే 7ఏళ్లుగా రైల్వే జోన్‌పై ప్రతిపాదనలు, డిపిఆర్‌లు సిద్ధం చేసుకుని, స్థలం సైతం తగినంత విశాఖలో ఉన్నప్పటికీ కేంద్ర రైల్వే బోర్డు నుంచి ఎలాంటి కదలికా లేదు. అసలు డిపిఆర్‌ను కేంద్రం ఆమోదించిందా? లేదా? అన్న విషయాన్ని కేంద్ర రైల్వే బోర్డు నుంచి సమాధానం ఇంతవరకూ లేదు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచీ ఎలాంటి ప్రకటనా ఇంతవరకూ లేదు. రైల్వే జోన్ తమ ప్రభుత్వం ఎప్పుడో ఏర్పాటు చేసేసి ఉండేదని స్థలం సరైనది రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదంటూ రాష్ట్ర బిజెపి పెద్దలు చెబుతూవచ్చారు. వాస్తవానికి ముడసర్లోవ వద్ద సర్వే నెంబరు 57 నుంచి 59 పి, 61 పి, 62పి, 63, 64, 65 నెంబర్లలో సుమారు 52 ఎకరాలను రైల్వే శాఖ, ఎపి

మిగతా 2లో..

ఇకెవైసి నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు

చివరికొచ్చిన ఇకెవైసి గడువు

- రైతు సేవా కేంద్రాల్లో సమాచార ప్రదర్శన
- తప్పుల సవరణకు 16లోపు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఇకెవైసి నమోదు గడువు దాదాపు చివరకొచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ పంట, ఇకెవైసి నమోదులో దొర్లిన పొరపాట్లను సరిచేసేందుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది. ఈ లోపు ప్రదర్శిత సమాచారంలో దొర్లిన తప్పులను సరిచేసేందుకు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. రైతు సేవ కేంద్రాల్లో రైతులు విధిగా పంట నమోదులో లోపాలను తెలియజేయాల్సివుంది. ఖరీఫ్‌లో వెబ్‌ల్యాండ్, అటవీ హక్కుల చట్టం, ఇతర భూ వివరాలను వ్యవసాయశాఖాధికారి లాగిన్‌లోని సమాచారం ద్వారా జియో కో-ఆర్డినేట్స్‌తో రైతు పంట వివరాలు నమోదుచేశారు. జిల్లాలో 2,82,530 ఎకరాలకు చెందిన 2,07,209 మంది రైతుల ఈ పంట నమోదు పూర్తయింది. ఈ పంట నమోదుచేసుకున్న 2,07,209 మంది రైతుల్లో 1,95,880 మంది రైతుల ఇకెవైసి పూర్తయింది. మంగళవారం మధ్యాహ్నం నాటి సమాచారం ప్రకారం 11,329 మంది రైతులు ఇకెవైసి చేసుకోవాల్సివుంది. వ్యవసాయశాఖాధికారులు ఈ పంట, ఇకెవైసి శతశాతం పూర్తవుతుందని చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి వ్యవసాయాధారిత ప్రయోజనం పొందేందుకు రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదుతో పాటు ఇకెవైసి చేసుకోవాల్సివుంది. ఈ పంట నమోదుచేసుకొని, ఇకెవైసి చేసుకోలేని రైతుకు

మిగతా 2లో..

పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకివ్వొద్దు

వార్త మెయిన్3లో..

బాలోత్సవం ఆహ్వాన సంఘం ఏర్పాటు

వార్త 2లో..

50 కిలోల గంజాయి పట్టివేత

వార్త 3లో..

నిత్యావసరాల ధరాభారంపై నిరసన

వార్త 4లో..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టాలని, వారు ఇష్టపడి తినేలా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు, నిర్వహణ తీరుపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలని, మెనూ

మిగతా 2లో..

సామ్‌సంగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తమిళనాడు రాష్ట్రం శ్రీపెరుంబుదూర్‌లోని సామ్‌సంగ్ తయారీ యూనిట్‌లో పనిచేస్తున్న 1470 మంది కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డైమండ్ పార్కు వద్ద ఉన్న సామ్‌సంగ్ షాపు ముందు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం సంఘీభావ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, దక్షిణకొరియాకు సంబంధించిన బహుళజాతి సంస్థ సామ్‌సంగ్ శ్రీపెరుంబుదూర్‌లోని ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్‌లో సుమారు 1800 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా 1470మంది యూనియన్ పెట్టుకొని డిమాండ్లతో కూడిన వినతి యాజమాన్యానికి ఇస్తే యూనియన్ పెట్టుకొనే హక్కు లేదని, తొలగిస్తామని బెదిరించడం దుర్మార్గమన్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో కార్మికులకు యూనియన్ పెట్టుకొనే హక్కు ఉందన్నారు. దక్షిణకొరియా బహుళజాతి సంస్థలైన సామ్‌సంగ్, ఎల్‌జి పాలిమర్స్, పోస్కోవంటి కంపెనీలకు భారతదేశంలో కార్మికచట్టాలు అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం కార్మికహక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో గత నెల 9వ తేదీ నుంచి సమ్మెలోకి వెళితే వారి డిమాండ్ల పరిష్కారం చేయకుండా కార్మికులపై నిర్బంధం ప్రయోగించి అక్రమంగా తొలగింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు.

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగుల డిమాండ్లను సామ్‌సంగ్ పరిష్కారం చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, పి.వెంకటరెడ్డి, కెఎం.కుమార్‌మంగళం, లోకేష్, పి.వెంకటరావు, వి.నరేంద్రకుమార్, జిఎన్.చలపతి, ఎం.సూరీడు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం ఆహ్వాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవం - 2024 ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవంబర్ 6,7,8 తేదీల్లో విశాఖ సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం పాఠశాలలో నిర్వహించే బాలోత్సవం 2024 పోస్టర్, బాలోత్సవం థీమ్ సాంగ్ విడుదలచేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ, గత ఏడాది జరిగిన బాలోత్సవంలో 95 పాఠశాలల నుంచి 6 వేల మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా అటువంటి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశ రావు, డాక్టర్ శ్రీనివాసరావు, జెవిసి వైస్ చైర్మన్ హెచ్‌జిఎస్ అనూరాధ, విసిసి వ్యవస్థాపకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ కె.రమాప్రభ, ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు శ్రీనాథ్, సుధ, బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బిఆర్‌బి.రాజు, విసిసి కన్వీనర్ కె.సుశీల, రాణి మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ రవి, ప్రముఖ సాహితీవేత్త జెపి.శర్మ, గురజాడ సాంస్కృతిక వేదిక ప్రతినిధి వై.అప్పారావు, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎం.చంటి, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు వైఆర్‌కె.ప్రసాద్, యువజన విభాగం నాయకులు కె.సంతోష్, వాలంటీర్ల బృందం ఎం.గుణశంకర్, ఎస్.హరిత, ఆవాజ్ కార్యదర్శి ఆశ్రాఫ్, రేడియో అనౌన్సర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆహ్వానసంఘం ప్రతినిధులు

ఆహ్వానసంఘం

ఈ సందర్భంగా రిసెప్షన్ కమిటీని ఏర్పాటుచేశారు. గౌరవాధ్యక్షులుగా లయన్ ప్రొఫెసర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాదరావు, కన్సర్న్ సంస్థ, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ విశాఖపట్నం, ఆసరా చారిటబుల్ సొసైటీ, కైట్స్ జూనియర్ కాలేజీ, రోటరీ క్లబ్ విశాఖ మెట్రో, జెసిఐ, కృష్ణా మెటర్నిటీ హాస్పిటల్, ఎంవిఆర్ డయాబెటిస్, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, రచయితలు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వంటి సంస్థల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఇంకా కొన్ని సంస్థలను కలిసి వారిని కూడా భాగస్వామ్యం చేస్తామని ప్రతినిధులు చెప్పారు.

మొదటి పేజీ తరువాయి..

రైల్వే జోన్ ఆశల పల్లకేనా!

ప్రభుత్వం గతంలోనే సిద్ధం చేసినా ఇది పనికిరాదంటూ వాదించిన ఢిల్లీ పెద్దలు 15 రోజుల క్రితం ఈ స్థలానికి ఆమోద ముద్ర వేశారు. 2016లో ఎత్తేసిన వాల్తేరు డివిజన్ గురించి కేంద్రం మాట్లాడడం లేదు. డివిజన్ లేకుండా కొత్తగా జోన్ ఇచ్చినా ఏం లాభం ? అంటూ ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేషరతుగా రైల్వేజోన్ పనులకు శ్రీకారం చుట్టి డివిజన్‌ను కొనసాగించాలన్న డిమాండ్‌కు కేంద్రం తలొగ్గేలాగ కూటమిలోని జనసేన, టిడిపి అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కేంద్రంపై ఒత్తిడి తేవాలన్న వాదన ఈ ప్రాంతం నుంచి బలంగా వినిపిస్తోంది.

చివరికొచ్చిన ఇకెవైసి గడువు

ప్రకృత్తి విపత్తుల సందర్భంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా, ఇతర పథకాలు, రాయితీలు, ప్రభుత్వ పథకాలు వర్తించే అవకాశంలేదు. ఈ పంట, ఇకెవైసికి ప్రభుత్వం ముడిపెట్టడంతో ఈ పంట నమోదుచేసుకున్న రైతులంతా ఇకెవైసి చేసుకుంటున్నారు. సాంకేతిక కారణాలతో ఇకెవైసి చేసుకోలేకపోయినా పథక ప్రయోజనాలు పోతాయన్న భయంతో పొలం పనులు మానుకొని రైతు సేవ కేంద్రాలకు వెళ్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

విషయంలో పిల్లల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. భోజనం అందించే విషయంలో రాజీ పడొద్దని, పరిమాణం తగ్గించవద్దని సూచించారు. పోషకాలతో కూడిన ఆహారం మెనూ ప్రకారం అందజేయాలని చెప్పారు. ఉదయాన్నే తప్పకుండా రాగిజావ, మధ్యాహ్నం ఇంటర్వెల్ తర్వాత చిక్కీ ఇవ్వాలన్నారు. రోజుకొక మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని చెప్పారు. పిల్లలు ఆహారాన్ని వృథా చేయకుండా పిఈటీలు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఆహారం వండే పరిసరాల్లో శుభ్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, తనిఖీ బృందాల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆహారం తయారు చేసే ఏజెన్సీలకు నాణ్యమైన సరకులు అందజేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్ విధానాన్ని ప్రోత్సహించాలని, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు తరచూ చేయాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ జిల్లాలో పథకం అమలు గురించి వివరాలు వెల్లడించారు. 581 పాఠశాలల్లో పథకం అమలవుతుందని, వాటిలో 315 పాఠశాలలకు అక్షయ పాత్ర, మరొక 266 పాఠశాలలకు కుకింగ్ ఏజెన్సీ ద్వారా ఆహారం అందిస్తున్నామని వివరించారు. 97.5 శాతం ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి, ఐసిడిఎస్ పీడీ జయదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 29 నుంచి ప్రాపర్టీ ఎక్స్ పో

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలస్ వేదికగా నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న 10వ క్రెడాయ్ విశాఖపట్నం ప్రాపర్టీ ఎక్స్ పో 2024 కర్టెన్ రైజర్ వేడుక సోమవారం సాయంత్రం విశాఖలోని ప్రముఖ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, ఎస్‌బిఐ డివిజనల్ జనరల్ మేనేజర్ రియల్ ఎస్టేట్ అండ్ హౌసింగ్ బిజినెస్ యూనిట్ సీతకాశి సింగ్, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ప్రాపర్టీ ఎక్స్ పో గణనీయమైన సంఖ్యలో సందర్శకులను, పెట్టుబడిదారులను రియల్ ఎస్టేట్ ఔత్సాహికులను ఆకర్షిస్తుందని తెలిపారు. అనంతరం క్రెడాయ్ ప్రెసిడెంట్ ధర్మేంద్ర కార్యదర్శి వి.శీను, చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి) మాట్లాడుతూ, స్థానిక రియల్ ఎస్టేట్ రంగానికి ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో ఎంతగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ ఎక్స్ పో రియల్ ఎస్టేట్ ప్రాపర్టీస్ అన్ని ఒకే చోట చేర్చే ప్రత్యేకమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రాపర్టీ ఎక్స్ పో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీస్ సంబంధించి 80 స్టాళ్లను ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు.

16న బహిరంగ వేలం

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి 3, 4 జోన్లలో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, కల్యాణ మండపం, మార్కెట్లకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయా జోన్ల కమిషనర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 3వ జోన్ (ఆశీల్‌మెట్ట) పరిధిలో వివిధ వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలకు ఈ నెల 16, ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ప్రకటించారు.

4వ జోన్ (సూర్యభాగ్) కార్యాలయం వద్ద షాపు రూములు, కల్యాణ మండపం, మార్కెట్లు గుత్తకు ఇచ్చేందుకు ఈ నెల 16న ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు వివరాలకు ఆయా జోన్ల కార్యాలయం సంప్రదించాలని సూచించారు.

IN THE COURT OF HON'BLE III ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIM'S TRIBUNAL: KAKINADA
M.V.O.P. NO. 38/2023

Between:
Nandipati Satyanarayana ***...Petitioner***
AND
1.Pudi Narendra & Another ***...Respondents***

To:
R-1: Pudi Narendra, S/o.Apparao, Driver and Owner of Car bearing No.AP 31DL 6881, R/o. D.No. 1.21, Rachapalli (V), Anakapalli District.

Please take notice that the above motor accident claim petition filed by Petitioner against you stands posted to **07-11-2024** for your appearance in person or through your counsel **at 10.30 a.m.** before the above Hon'ble Court. Failing which the matter shall be decided by the Hon'ble Court in your absence as per law.

"BY ORDER OF THE HON'BLE COURT"

S.MURTUJA
ADVOCATE, KAKINADA
CELL:9652538888

IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE NARSIPATNAM
H.M.O.P.No. 71/2024

Between:
Jeereddy Rama Tulasi,
W/o. Apparao . . . Petitioner
And:
Jeereddy Apparao,
S/o late Venkateswararao
. . . Respondent

To:
Jeereddy Apparao,
S/o. Late Venkateswararao,
Tapi Mastri (Mason)
R/o. Dr.No. 31-69/1, Near Ramalayam, Kotha Veedhi, Narsipatnam Municipality and Mandal, Anakapalle District

In the above H.M.O.P. 71/2024 Summonses were riot served on you. Hence as per the orders of the Honourable Court, you are being the RESPONDENT, you are requested to appear before the Honourable Court in order to defend your case. The above matter is stands posted to **29-10-2024 BY 10-30 A.M.**, for your appearance this publication is issued by way of substitute service. On your failure, you will be set exparte.

R.D.V.G.V. PRASAD
Advocate for Petitioner
Velama Veedhi,
Narsipatnam
Anakapalle District.
Narsipatnam Cell : 99484 70802
Date: 8-10-2024

నోటీసు
మహారాజశ్రీ చోడవరం అడిషనల్ జ్యూడిషనల్ 1వ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు వారి ఫైల్
D.V.C.No. 01/2022

బిట్వీన్:
గనిశెట్టి వెంకటలక్ష్మి వగైరాలు . . . పిటీషనర్లు
మరియు:
గనిశెట్టి నాగ అప్పలసురేష్ వగైరాలు
. . . రెస్పాండెంట్లు

To:
R-1: గనిశెట్టి నాగఅప్పలసురేష్,
తండ్రి ఆదినారాయణ, Employee in HPCL
R-5: గనిశెట్టి సత్య రమేష్,
తండ్రి ఆదినారాయణ, జ్న2రుసా॥
ప్లాట్‌నెం. 507, సౌభాగ్య రెసిడెన్సీ, రైల్వేస్టేషన్‌రోడ్, యలమంచిలి గ్రామం & మండలం.

జనయిద్దరకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషనర్లు మీ వగైరాలు పైని DOMESTIC VIOLENCE ACT, క్రింద పిటిషనులో వివరించిన పరిహారములు కోరుతూ U/s 12 of Prorection of Women from DVC Act 2005 ప్రకారం DVC File చేసియున్నారు. అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలున్ననూ, మీరు **తే:15-10-2024దీని ఉదయం 10-30 ని॥లకు** పైని వివరించిన కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనిచో మీ పరోక్షమందు విమర్శించి తీర్మానించడమగునని యిందు మూలంగా మీకు తెలియపర్చుడమైనది.

SARIPALLI BHAVANI SANKARAM
చోడవరం పిటీషనర్లు తరపు అడ్వకేట్,
తే:8-10-24 చోడవరం

మహారాజశ్రీ పార్వతీపురం 2 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EP 53/2022 O.S.60/ 2015

Between :
గొట్టు ముక్కల శేష బాబు S/o. GVVSS రామకృష్ణ రాజు ......పిటిషనర్ (డిక్రిహోల్డర్)
And :
1. బలివాడ కాశీపతిరావు, తండ్రి లేటు రామారావు
2. బలివాడ శంకరరావు, తండ్రి లేటు రామారావు.
3. బలివాడ ఈశ్వరరావు, తండ్రి లేటు రామారావు.
4. బలివాడ నీలకంఠేశ్వరరావు, తండ్రి లేటు రామారావు,
5. నడిపల్లి శ్రీలక్ష్మి, భర్త నాగేశ్వరరావు,
6. పసలపూడి అపర్ణ శుభసాలిని, భర్త బెల్లెల అశోక్ కుమార్, వయస్సు 35 సంవత్సరాలు, డోర్ నెంబర్10-48/10/2, ప్లాట్ నెంబర్ 103, కాశ్యప్ ఎన్ క్లావ్, కొమ్మాది, మధురవాడ, విశాఖపట్నం.

.......రెస్పాండంట్లు(జె. డిఆర్లు)

నోటీసు

పై నెంబరు దావా, ఇందలి పిటిషనర్ , రెస్పాండెంట్లు నెంబర్ 1 నుండి 6ల పైన దావా పరిహరములు కోరుతూ దాఖలు చేసి తదుపరి మీ ఆరుగురిపైన తే 19-01-22దీన 'డిక్రీ పొందిన తరువాత మీరు తీర్పు అమలు జరుపుటకు అంగీకరించనందున ముందుగా రెస్పాండెంట్లు 1 నుండి 6ల పైన అమలు దాఖలు చేయగా, ఇందలి రెస్పాండెంట్ నెంబర్ 6 పిటీషన్లలో ఉదహరించిన చిరునామాలో నివశించుచున్నప్పటికి ఎన్ని మార్లు నోటీసులు పంపించినప్పటికి సదరు నోటీసులు అందుకోకుండా తప్పించుకుంటున్నందున కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా తే 11-09-2024 దీన నోటీసు ఇవ్వమని ఆర్డర్ జారీ చేసియున్నారు.

పై నుదహరించిన అమలు **తే16-10-2024దీ**ని పైకోర్టులో మీ హజరు నిమిత్తం ఉన్నందున ఆ తేదిన మీరు (రెస్పాండెంటు నెం.6) **ఉదయం10-30 గం॥**లకు పై కోర్టులో హాజరై ఏమైనా అభ్యంతరములున్నచో కోర్టు వారికి తెలియజేసుకోవలెను లేనియడల మీ పరోక్షమందు పై నెంబరు అమలు పరిహారింపబడునని తెలియజేయడమైనది.

టి.జోగారావు,
అడ్వకేట్, ఎస్ఎన్‌పి కాలనీ,
పార్వతీపురం, సెల్ : 9441037309

మహారాజశ్రీ పార్వతీపురం 2 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EA 37/2023, EP 53/2022, O.S.60/2015

Between :
గొట్టు ముక్కల శేష బాబు S/o. GVVSS రామకృష్ణ రాజు.....పిటిషనర్ (డిక్రీ హోల్డర్), వాది.
And :
1. బలివాడ కాశీపతిరావు, తండ్రి లేటు రామారావు
2. బలివాడ శంకరరావు, తండ్రి లేటు రామారావు.
3. బలివాడ ఈశ్వరరావు, తండ్రి లేటు రామారావు.
4. బలివాడ నీలకంఠేశ్వరరావు, తండ్రి లేటు రామారావు,
(డైడ్ **5.** నడిపల్లి శ్రీలక్ష్మి, భర్త నాగేశ్వరరావు,
6. పసలపూడి అపర్ణ శుభసాలిని, భర్త బెల్లెల అశోక్ కుమార్, వయస్సు 35 సంవత్సరాలు, డోర్ నెంబర్ 10-48/10/2, ప్లాట్ నెంబర్ 103, కాశ్యప్ ఎన్ క్లావ్, కొమ్మాది, మధురవాడ, విశాఖపట్నం.
7. బలివాడ సరోజినీ, భర్త లేటు ఈశ్వరరావు, వయస్సు 60 సంవత్సరాలు, డోర్ నెంబర్ 8-11-90, కాపు వీధి, పైడితల్లమ్మ టెంపుల్ స్ట్రీట్, రైల్వే స్టేషన్ రోడ్, విజయనగరం జిల్లా.
8. బలివాడ సాయిరాం శౌర్య, తండ్రి లేటు ఈశ్వరరావు, వయస్సు 32 సంవత్సరాలు, డోర్ నెంబర్ 8-11-90, కాపు వీధి,పైడితల్లమ్మ టెంపుల్ స్ట్రీట్, రైల్వే స్టేషన్ రోడ్, విజయనగరం జిల్లా.
9. బలివాడ చరిస్మా, D/o. లేటు ఈశ్వరరావు, వయస్సు 23 సంవత్సరాలు, డోర్ నెంబర్ 8-11-90, కాపు వీధి,పైడితల్లమ్మ టెంపుల్ స్ట్రీట్, రైల్వే స్టేషన్ రోడ్, విజయనగరం జిల్లా. ...రెస్పాండెంట్లు(జెడిఆర్‌లు)

నోటీసు

పై నెంబరు దావా ఇందలి పిటిషనర్, రెస్పాండెంట్లు నెంబర్ 1 నుండి 6ల పైన దావా పరిహరములు కోరుతూ దాఖలు చేసి తదుపరి మీ ఆరుగురిపైన తే 19-01-22దీన 'డిక్రీ పొందిన తరువాత కోర్టువారి తీర్పు అమలు జరుపుటకు మీరు అంగీకరించనందున ముందుగా రెస్పాండెంట్లు 1 నుండి 6 పైన అమలు దాఖలు చేయగా, ఇందలి రెస్పాండెంట్ నెంబర్ 3 అమలు పెండింగ్‌లో ఉంటుండగా చనిపోయినారు అందువలన అతను వారసులైన రెస్పాండెంట్లు నెంబర్ 7 నుండి 9 ఆసామీలను అతని వారసులుగా చేర్పించమని పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్‌లో ఉదహరించిన చిరునామాలో మీరు నివశించుచున్నప్పటికి ఎన్నిమార్లు నోటీసులు పంపించినప్పటికి సదరు నోటీసులు అందుకోకుండా తప్పించుకుంటున్నందున కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా తే 11-09-2024 దీన నోటీసు ఇవ్వమని ఆర్డర్ జారీ చేసియున్నారు.

పైనుదాహరించిన అమలు (వారసుల పిటిషన్) **తే 16-10-2024దీ**కి వాయిదా ఉన్నందున పైకోర్టులో మీరు **ఆ దినం 10:30 నిముషాల**కు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై ఏమైనా అభ్యంతరములున్నచో కోర్టు వారికి తెలియజేసుకోవలెను లేనియడల మీ పరోక్ష మందు పై నెంబరు అమలులో (వారసుల పిటిషన్) పరిహారింపబడునని తెలియజేయడమైనది.

టి.జోగారావు,
అడ్వకేట్, ఎస్ఎన్‌పి కాలనీ,
పార్వతీపురం, సెల్ : 9441037309

పరాయిపంచన అంగన్వాడీ కేంద్రాలు

- సొంత భవనాలు లేక నిర్వహణకు అగచాట్లు
- అరకొర వసతి, సౌకర్యాల లేమితో అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు, సిబ్బంది

ఒకటో జోన్ సామాజిక భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి -భీమునిపట్నం :భీమిలి డివిజన్‌లో పలు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. భీమిలి రూరల్, అర్బన్‌లో కలిసి మొత్తంగా 100 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 90 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు కాగా, 10 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 46 అంగన్వాడీలకు సొంత భవనాలు ఉండగా, 19 అంగన్వాడీలు అద్దె భవనాల్లోను, మిగిలిన 35 కేంద్రాలు అద్దె లేకుండా సామాజిక భవనాలు, ఇతరత్రా వాటిల్లో నిర్వహిస్తున్నారు.

ఆనందపురం మండలంలో 75 అంగన్వాడీ కేంద్రాలుండగా, వీటిల్లో 64 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు కాగా, 11 మినీ అంగన్వాడీ కేంద్రాలు. ఇందులో 45 సొంత భవనాల్లోను, 15 అద్దె భవనాల్లోను, మరో 15 రెంట్ ఫ్రీ గా ఉన్నాయి. పద్మనాభం మండలంలో 57 అంగన్వాడీ కేంద్రాలకుగాను, 51 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు కాగా, మిగిలిన ఆరు మినీ అంగన్వాడీ కేంద్రాలు. వీటిల్లో 32 సొంత భవనాల్లోను, 15 అద్దె భవనాల్లోను, మరో 10 రెంట్ ఫ్రీ గా ఉన్నాయి. సొంత భవనాలున్న అంగన్వాడీ కేంద్రాలకు అపుడపుడూ అవసరమైతే నిర్వహణ కింద మరమ్మతులు చేపడుతూ కాలం వెల్లదీస్తుండగా, సొంత భవనాలు లేని అంగన్వాడీలకు పక్కా భవనాలను సమకూర్చేందుకు సరైన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో, పరాయిచెంతన వసతి, సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతూ కాలం వెల్లదీయక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి, భీమిలి డివిజన్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన సొంత భవనాలను సమకూర్చడంతోపాటు పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అంగన్వాడీ సేవలను సమృద్ధిగా అందించేందుకు అవసరమైన సౌకర్యాలను సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది కొరత లేకున్నా వసతి లేమితో అవస్థలు

భీమిలి అర్బన్, రూరల్ మండలంలో ఉన్న 100 అంగన్వాడీ కేంద్రాల్లో 90 మంది కార్యకర్తలు, 86 మంది సహాయకులు (ఆయాలు) ఉన్నారు. ఆనందపురం మండలంలో ఉన్న 75 కేంద్రాల్లో 63 మంది కార్యకర్తలు, 59 మంది సహాయకులు (ఆయాలు) ఉన్నారు. పద్మనాభం మండలంలో 57 అంగన్వాడీ కేంద్రాల్లో 48 మంది కార్యకర్తలు, 47 మంది సహాయకులు (ఆయాలు) ఉన్నారు. మూడు మండలాల్లో మొత్తంగా 205 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు, 27 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి.మినీ అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రం సహాయకులే అటు కార్యకర్త, ఇటు ఆయా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

భీమిలి అర్బన్ , రూరల్ మండలంలో ఉన్న 100 కేంద్రాల్లో 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 1002 మంది ఉన్నారు. ఆనందపురం మండలం లో 583 మంది, పద్మనాభం మండలం లో 522 మంది పిల్లలు ఉన్నారు. వీరే గాకుండా 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు కూడా వివిధ అంగన్వాడీ సేవలు అందిస్తున్నారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక: దసరా పండుగకైనా జివిఎంసి గాజువాక జోన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన బకాయి చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సిఐటియు జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం గాజువాక జోనల్ ఆఫీస్ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు ఆప్కోస్ ద్వారా జీతాలు చెల్లిస్తున్నప్పుడు 2022 జనవరి నుంచి 2024.జులైలోగా కొన్ని నెలల్లో కొంతమంది పారిశుధ్య కార్మికులకు జీతాలు మిస్సయ్యాయని, వాటిని చెల్లించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం కార్పొరేటర్స్ ద్వారా నియమించిన డే అండ్ నైట్ పారిశుధ్య కార్మికులకు, దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న పారిశుధ్య కార్మికుల స్థానంలో దినసరి కార్మికులుగా పనిచేస్తున్న వారికి వేతనాలు అందలేదన్నారు. దసరా పండగకు ముందే వారికి వేతన బకాయిలను చెల్లించి పండుగను ఆనందంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంఎంహెచ్ఓ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నేతలు నక్క నాగరాజు, సోమాధుల గణేష్, సత్యవతి, శ్రీను, రాజు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డులోని పలు ప్రాంతాలలో వియంఆర్‌డిఎ కమిషనర్ కెవిఎన్.విశ్వనాథన్‌తో కలిసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పర్యటించారు. ఎన్ఎడి బస్‌స్టాప్ నుంచి ఫ్లైఓవర్ వరకు పర్యటించారు. యునైటెడ్ క్రైస్ట్ చర్చి పక్కగా గాంధీనగర్‌ను అనుసంధానం చేసే రోడ్డు సమస్యను కమిషనర్‌కు వివరించి, పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ శ్రీధర్ కోరారు. ఫ్లైఓవర్ వంతెన మధ్యలో ఉన్న పార్క్, వాటర్ ఫౌంటెన్ నిరుపయోగంగా ఉన్న విషయాన్ని వివరించారు.

గీతం సైన్స్ డీన్‌కు ప్రతిష్టాత్మక ఐజియు అవార్డు

ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ

ప్రజాశక్తి -మధురవాడ : ప్రఖ్యాత భూభౌతిక శాస్త్రవేత్తలకు ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజియు) ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక 'హరినారాయణ్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు -2024'కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఎంపికయ్యారు. మెరైన్ జియోఫిజిక్స్‌లో జరిపిన విశిష్ట పరిశోధనలను గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు జాతీయ స్థాయి సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్‌లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరగనున్న ఐజియు 61వ వార్షిక సమావేశాలలో ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేయనున్నారు. సముద్ర శాస్త్ర అధ్యయనాలలో 42ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం గల ప్రొఫెసర్ కృష్ణ అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సహ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్‌గ్రఫీ (గోవా)లలో పనిచేశారు. అలాగే ఓఎన్‌జిసి, గెయిల్, డిజిహెచ్ వంటి ప్రఖ్యాత సంస్థలకు హైడ్రోకార్బన్ నిల్వలను వెలికితీయడంలో శాస్త్రీయ సహకారం అందించారు. ప్రొఫెసర్ కృష్ణ చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుతో పాటు జెసి బోస్ నేషనల్ ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఐజియు అవార్డుకు ఎంపిక కావడం పట్ల ప్రొఫెసర్ కృష్ణ స్పందిస్తూ భవిష్యత్తులో శాస్త్ర విజ్ఞానాన్ని మరింతగా విస్తరించడానికి ప్రోత్సాహకరంగా ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు. కాగా ప్రతిష్టాత్మక అవార్డుకు ప్రొఫెసర్ కృష్ణ ఎంపిక కావడం పట్ల ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి హర్షం వెలిబుచ్చి, అభినందించారు.

ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగుల ఔదార్యం

బ్యాగుల పంపిణీ చేస్తున్న ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి-గాజువాక: పైడిమాంబ కాలనీలో విసిసి క్లబ్ ట్యూషన్‌సెంటర్లో చదువుతున్న పిల్లలకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులు బ్యాగ్స్, బుక్స్, పెన్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉషారాణి, మెహర్‌కుమార్, చెన్నయ్య, రమణారావు, ప్రతిభ, సరస్వతి, ఉషారాణి, మీనాకుమారి పాల్గొన్నారు.

యారాడ ఘాట్ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి నిధులు రూ.3.50కోట్లతో చేపడుతున్న యారాడ ఘాట్‌రోడ్డు అభివృద్ధి పనులను 40వ వార్డు కార్పొరేటరు గుండపు నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఎన్నోఏళ్ళుగా యారాడ ఘాట్ రోడ్డు సమస్యతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ నాగేశ్వరరావు చొరవతో నిధులు మంజూరు కాగా, యుద్దప్రాతిపదికన పనులు జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యారాడ ఘాట్‌రోడ్డులో రూ.1.50కోట్లతో రోడ్డుకు ఇరువైపులా 2.5మీటర్ల వెడల్పున, రెండు కిలోమీటర్ల పొడవున సిసి రోడ్లు నిర్మాణం, రూ.కోటితో 3 కిలోమీటర్ల పొడవునా తారురోడ్డు, రూ.50 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా రక్షణ కంచె, రూ.50 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్స్, పెయింటింగ్ వంటి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు సంబంధిత కాంట్రాక్టర్ వెల్లడించారు.

రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస: భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ఉద్యోగి మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం..తూర్పు గోదావరి జిల్లా, గొల్ల ప్రోలు మండలం, దుర్గాడకు చెందిన ఎస్.రాంబాబు (28) సోమవారం రాత్రి షిఫ్ట్ విధులు ముగించుకుని మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై దివీస్ నుంచి తగరపువలస వెళ్తుండగా సిటీ నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించ బోయి ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీ కొని రోడ్డుపై తూలిపడ్డారు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, రెండేళ్ల కుమారుడు. వీరు తగరపువలస, ఆదర్శ నగర్ లో అద్దె ఇంట్లో ఉంటున్నారు.భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇలా ఉండగా మృతుని బంధువుల ఇంట పెళ్లి సందర్భంగా బుధవారం నుంచి కొద్ది రోజులు సెలవు పెట్టారు. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో భార్య కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు.

50 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవనగర్‌లోని ఒక ఇంటిలో నిల్వ ఉంచిన 50కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీస్‌లు మంగళవారం వేకువజామున పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి, ఏడుగురు నిందితులను, ఒక బాలికను అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇంటిలో నిల్వ ఉంచిన 50 కిలోల గంజాయిని పట్టుకున్నారు.

నిందితుల నుంచి ఒక ఆటో, మూడు మోటార్ సైకిల్స్, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. బాలికను జువైనల్ హోంకు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మహిళలకు ఒడిశాకు చెందిన వారుకాగా, మిగిలిన వారిలో ఇద్దరు అల్లూరి జిల్లాకు, మరో ముగ్గురు అనకాపల్లి జిల్లాకు ఒకరు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - చీడికాడ : స్కూటీపై గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.సతీష్ తెలిపారు. మండలం వరహాపురం గ్రామం వద్ద స్కూటీపై ముగ్గురు వ్యక్తులు 15 కేజీల గంజాయి తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులనుంచి సెల్ ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

తాపీ మేస్త్రి ఆత్మహత్య

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలంలో మేడివాడ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి గంటా కృష్ణ(36) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడుకు బానిసైన కృష్ణను భార్య దేవి మందలించడంతో మనోవేదనకు గురై పక్కనే ఉన్న పెంకుటిల్లులో దూలానికి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై రావికమతం ఎస్ఐ రఘువర్మ అందించిన వివరాల మేరకు మేడివాడ గ్రామానికి చెందిన గంటా కృష్ణకు అదే గ్రామానికి చెందిన దేవితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. కృష్ణ మద్యానికి బానిసయ్యాడు. భార్య పిల్లలు కుటుంబ సభ్యులను పట్టించుకోపోవడంతో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసాడు. మద్యం మత్తులో వున్న భర్తను ఆరోగ్యం పాడుచేసుకోవద్దని భార్య మందలించింది. దీంతో ఆగ్రహించి పక్కన ఉన్న పాత పెంకిటిల్లులో దూలం కు ఫూరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం సత్తిబాబు భార్య లక్ష్మి తమ ఇంటిలో కృష్ణ మృతదేహాన్ని చూసి చుట్టుపక్కల వారికి తెలియజేసింది. ఈ సంఘటనపై భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై రఘువర్మ కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది శివాలయం వద్ద గుర్తు తెలియని సాధువు మృతి చెందారు. స్థానిక శివాలయం వద్ద సాధువులు రోజు భిక్షాటన చేస్తుంటారు. యథావిధిగా భిక్షాటన ముగించుకుని శివాలయం వద్ద నిద్రపోయిన సాధువు, మంగళవారం తెల్లవారే సరికి మృతి చెందినట్లు గుర్తించారు. మృతునికి స్థానిక పంచాయతీ ఈవో లోవరాజు దహన సంస్కారాలు చేయించారు.

నిత్యావసరాల ధరాభారంపై నిరసన

తగరపువలసలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి- తగరపువలస : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వై జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, ప్రజలు నిత్యం వాడే ఉప్పు, బియ్యం, పప్పు, వంటనూనె, ఉల్లి, టమోటా ఇలా నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం రాము, జీరు సత్యారావు, పల్లా పెంటరాజు, పల్లా రమణ, డి శివ, రామకృష్ణ పాల్గొన్నారు

ఆనందపురం: పెరిగిపోతున్న ధరలను నియంత్రించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం ఆనందపురం జంక్షన్‌లో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు రవ్వ నర్సింగరావు, నాగరాణి మాట్లాడుతూ నిత్యవసరాల ధరాభారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్, నిత్యావసరాల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధరలకు రెక్కలొచ్చాయని, ఏనాడూ తగ్గిన పాపాన పోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముద్దాడ రాము, పల్ల పెంటరాజు, ఒ.ప్రమీల, నారాయణమ్మ ,శివ రామకృష్ణ ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ఆనందపురంలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నేతలు

విశాఖ కలెక్టరేట్ : పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సిఐటియు జగదాంబ జోన్‌కమిటీల ఆధ్వర్యాన పూర్ణామార్కెట్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం 'బంగారు వర్ణ కూరగాయల'తో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ, బండెడు డబ్బులు పట్టుకొని మార్కెట్‌కు వెళితే సంచెడు కాయగూరలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వందరోజులకే ప్రజలకు చుక్కలు చూపిస్తుదన్నారు. సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐద్వా నాయకులు వరలక్ష్మి, అన్నపూర్ణ సరోజిని, సిఐటియు నాయకులు ఎం. సుబ్బారావు, వై.రాజు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, సిఐటియు

నిత్యావసర ధరలపై ఐద్వా నిరసన

పరవాడ: నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మంగళవారం పరవాడ సంతలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ఉల్లిపాయలు, టమోటాలతో పాటు కొన్ని రకాల కూరగాయలు కిలో 100 రూపాయలు ఉండగా, ఏ కూరగాయలు రూ.80కు తగ్గకుండా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యులు మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనుకునేందుకు భయపడుతునారని తెలిపారు. ధరలు ఇలా మండిపోతుంటే పేదలు, సామాన్యులు ఎలా కొనుక్కొని తింటారని ప్రశ్నించారు. మహిళలు, బాలికలు పౌష్టికాహారం లోపం వల్లే రక్తహీనతకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం నిత్యవసర సరుకులను అదుపు చేయడంపై దృష్టి పెట్టాలని, రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులు, కూరగాయలు ప్రజలకు అందుబాటులో ఉండేలాగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు చుక్క దేవుడమ్మ, బంగారమ్మ, చిన్న దేవుడమ్మ, వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ సంతలో ఐద్వా ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

యువతకు ఆదర్శం సీతారాం ఏచూరి

ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నఆచార్య రామకృష్ణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : విలువలకు కట్టుబడిన నిష్కళంక నాయకునిగా, ఆదర్శ పార్లమెంటేరియన్‌గా, అనునిత్యం ప్రజాభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిగా సిపిఎం నేత సీతారాం ఏచూరి నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచారని ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆచార్యులు, జపాన్ ఇన్ఫర్మేషన్ స్టడీసెంటర్ డైరెక్టర్, ఎయు మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ అన్నారు. మంగళవారం స్టీల్‌ప్లాంట్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, మధు, అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపశమన సంరక్షణపై శిక్షణ

శిక్షణను ప్రారంభిస్తున్న జిమ్సర్ ప్రో విసి ఆచార్య గీతాంజలి

ప్రజాశక్తి -మధురవాడ: పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేషన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేసారు. వివిధ అనారోగ్యాలతో జీవితపు చివరి దశలో ఉండే వారికి ఉపశమన సంరక్షణ అవసరమన్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 56.8 మిలియన్ల మంది రోగులకు ఉపశమన సంరక్షణ అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు.

రోగులు, వారి సంరక్షకులు మానసికంగా కుంగిపోకుండా ఉండడానికి ఉపశమన సంరక్షణ చర్యలు ఉపయోగపడతాయని వెల్లడించారు. దీనికి నర్సింగ్ వృత్తిలో ఉండేవారి పాత్ర కీలకమన్నారు. శిక్షణ కార్యక్రమంలో నిపుణులు డాక్టర్ కరణ్వీర్‌సింగ్ మాత్రో, డాక్టర్ వి.అనూష, పి. తనూబ, ఎస్.వి.ఎల్. పద్మకుమారి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : శ్రీకాకుళం జిల్లా, కేశవరావుపేటలో రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీల్లో స్థానిక కెజిబివి ఇంటర్ సెకెండియర్ విద్యార్థిని కె దీపిక ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. తద్వారా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విశాఖ జిల్లా మొదటిస్థానంలో నిలిచినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని దీపిక, పిఇటి వరలక్ష్మిలను డిఇఒ ఎల్.చంద్రకళ, జిసిడిఒ ఖలేషా బేగం, ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఎస్ఎంసి చైర్మన్ కుమార్, వైస్‌చైర్మన్ రవణమ్మ అభినందించారు

సాధించిన పతకంతో దీపిక

పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వాసన్ ఐకేర్ వైద్యులు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి పజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 65వ వార్డు వికాస్‌నగర్ సచివాలయ ఆవరణలో మంగళవారం ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ప్రారంభించగా, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని, కార్మికులకు కంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. నిత్యం పారిశుధ్య పనిలో నిమగ్నమవుతున్న కార్మికులు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నరసింహపాత్రుడు సూచించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఖండించండి

ప్రజాశక్తి -గాజువాక: దళితులపై దాడులను ఖండించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సుబ్బన్న అన్నారు. మంగళవారం కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యంలో, ఉపాధ్యక్షులు గొలగాని అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుబ్బన్న మాట్లాడుతూ, దళితులంతా ఐక్యంగా కెవిపిఎస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి సోమాదుల గణేష్ మాట్లాడుతూ, సంఘం రాష్ట్ర వ్యాప్త పోరాటాలను వివరించారు. జోన్ కమిటీ సభ్యులు రాగలపూడి శ్రీనివాసరావు వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా

పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి -కరాస/ మాధవధార : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ విశాఖపట్నం పిఎఫ్ రీజినల్ కార్యాలయం వద్ద మంగళవారం ఎపిఆర్ పిఎ సంఘ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్యరాజు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, యువిఎస్ఎన్ వర్మ, కె.దీనబంధు అధ్యక్షతన ముందుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల అమరులైన సీతారామ ఏచూరి, కవి రచయిత గాయకుడు, బిహెచ్‌పివి విశ్రాంత ఉద్యోగి సన్యాసిరావు, నాగేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పించారు.

అనంతరం యువిఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి 15ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేని నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్త ధర్నాలకు కేంద్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని పిఎఫ్ ఆఫీసుల వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, దానికి డిఎ అనుసంధానం చేస్తూ హయ్యర్ పెన్షన్ అమలు, పెన్షనర్ దంపతులకు వైద్య సదుపాయం, కరోనా సమయంలో తీసేసిన రైల్వే రాయితీ పునరుద్ధరణ, రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులను సరఫరా, అందరికీ రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ,తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్లు దేశవ్యాప్త ఆందోళనలు చేస్తున్నారన్నారు. నంతరం పిఎఫ్ కమిషనర్‌ను కలిసి ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలు, పెండింగ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ చెల్లించిన రూ.600 కోట్లుకు సంబంధించి పెన్షనర్లకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందించట్లేదని, హిందుస్థాన్ షిప్ యార్డ్,ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమల పెన్షనర్లకు నోటీసులు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. దీనిపై పిఎఫ్ కమిషనర్ స్పందిస్తూ, స్టీల్ ప్లాంట్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్‌పై అభ్యంతరం తెలుపుతూ జోనల్ పిఎఫ్ ఆఫీస్ సమాచారం అందించారన్నారు. దీనిపై కేంద్ర పిఎఫ్ కార్యాలయం నుంచి స్పష్టమైన సమాచారం వచ్చిన తర్వాత తెలియజేస్తామన్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డు యాజమాన్యం గతంలో 12శాతం పిఎఫ్ కట్ చేయాల్సి ఉండగా. 10 శాతం మాత్రమే కట్ చేశారని, దీనిపై కోర్టులో కేసు ఉన్నందున వారికి నోటీసులు పంపలేదన్నారు. జింక్ పెన్షనర్ల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆర్‌టిసి పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారని యూనియన్ నేతలు వెల్లడించారు.

సామ్‌సంగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి

తమిళనాడులోని సామ్‌సంగ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా సిఐటియు అఖిలభారత కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు నాయకులు, కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ తమిళనాడులో సౌత్ కొరియా కంపెనీ అయిన సామ్‌సంగ్ ఉత్పత్తుల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసుకొని డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారని తెలిపారు. ఆ సమస్యలను యాజమాన్యం పరిష్కరించకపోగా సంఘం పెట్టుకున్నారనే నెపంతో కార్మికులను తొలగించడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా 1500 మంది కార్మికులు గత నెల రోజులుగా సమ్మెలో ఉన్నారన్నారు. భారత దేశ చట్టాలను ఈ దేశంలో ఉన్న కంపెనీలు గౌరవించాల్సి ఉండగా, సామ్‌సంగ్ యాజమాన్యం చట్టాలను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తక్షణమే సామ్‌సంగ్ కార్మికుల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, శాంతి, లవరాజు, సంతోష్, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్న చందు

ప్రజాశక్తి-సబ్బవరం

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలంలోని ఇరువాడ పంచాయితీ శివారు గణపతి నగర్ గ్రామానికి చెందిన మామిడి చందు పాల్గొన్నారు. హైదరాబాద్ మియాపూర్‌లోని ది క్రాక్ ప్లానెట్ స్కూల్లో సీబీఎస్ఈ సౌత్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్) హ్యాండ్ బాల్ పోటీలు గత సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో చదువుతున్న మామిడి చందు అండర్ -19 విభాగంలో ఆడిగా ఆయన జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన జట్టు జాతీయస్థాయిలో ఈ నెల 7 నుంచి 10 వరకు నాలుగు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియా బాద్ జిల్లా మోదీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. గ్రామానికి చెందిన మామిడి చందు తల్లిదండ్రులు కనకరాజు ఆటో డ్రైవర్ కాగా, తల్లి డ్వాక్రా సంఘ వివిఎ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

రూ.6 లక్షలతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి 84వ వార్డులో సాలాపువానిపాలెం గ్రామంలో రూ.6 లక్షలతో బోరు బావి నిర్మాణ పనులను ప్రారంభించారు. 84వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు సమక్షంలో, ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా నీలబాబు మాట్లాడుతూ సాలాపువాని పాలెం గ్రామం ప్రజలు మంచినీటి ఎద్దడి ఉందని కార్పొరేటర్ చిన్నతల్లి దృష్టికి తీసుకెళ్లగా, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదన మేరకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. 200 అడుగులు పైపులు వేసి నిరంతరం వాటర్ వచ్చే విధంగా పరీక్షలు నిర్వహించిన అనంతరం ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు. వార్డు పరిధిలో ఈ నిధులతో పైపులు మరమ్మతులు, బోరు మరమ్మతులు వంటివి గుర్తించి వార్డులో ప్రజలతో మాట్లాడి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలాపు మోహన్, సాలాపు రమణ, సాలాపు అప్పారావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- పెందుర్తి :జివిఎంసి 96వ వార్డు పుల్లగానిపాలెం వెళ్లే రోడ్డులో చైతన్య స్కూల్స్ సమీపంలోని ఆదేశమాంబ ఆలయంలో దేవీనవరాత్రులను పురస్కరించుకొని ఆలయధర్మకర్త శరగడం చిన అప్పలనాయుడు, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు టిటిడి వేద పండితుల పర్యవేక్షణలో చండీహోమం, పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో లాలం అప్పలనాయుడు, గంగు నాయుడు, భక్తులు పాల్గొన్నారు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్, అధికారులు

14 నుండి 'పల్లె పండుగ' వారోత్సవాలు

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని 645 పంచాయతీలలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలు ఈ నెల 14 నుండి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ పనులు, పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలు ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా వివరాలు తెలియజేస్తూ జిల్లాలో 214 కోట్ల రూపాయలు పనులను గుర్తించామని, 103 కోట్ల రూపాయలు పనులకు ఆమోదించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో అక్టోబరు 14 నుండి 20వ తేదీ వరకు అన్ని గ్రామపంచాయతీలలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొదలు పెట్టిన పనులను సంక్రాంతి నాటికి పూర్తిచేస్తామని జిల్లా కలెక్టరు తెలిపారు. భూగర్భజలాలు పెంపొందించుటకు చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించుటకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఎంఎ ప్రాజెక్టు అధికారి పూర్ణిమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రెవిన్యూ, సాగునీటి పారుదల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించుటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు లిస్టులను సిద్ధం చేయాలన్నారు. రెవిన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నియమ, నిబంధనలను పాటించి ఎన్నికలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ ఆయిషా, నర్సీపట్నం ఆర్‌డిఒ వి.వి.రమణ, నీటిపారుదల శాఖ ఇఇ ఎ.త్రినాధ్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

రేపు కోలాటం పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 10న సాయంత్రం 4గంటలకు స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో మండలస్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి. సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

మాజీ ఎంపీ సత్యవతికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో జిల్లా గ్రంథాలయం స్థాపనకు కృషి చేసిన మాజీ ఎమ్‌పి డాక్టర్ బివి.సత్యవతిని మంగళవారం సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం సత్కరించారు. ఈ సందర్భంగా నాగ భూషణం మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా నూతన జిల్లాగా ఏర్పడిన అనకాపల్లిలో జిల్లా గ్రంథాలయాన్ని నిర్మించాలని ఎన్నో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీగా బివి.సత్యవతి కృషి ఫలితంగా అనకాపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. త్వరలో ఈ పనులు పూర్తయి జిల్లా గ్రంథాలయం అన్ని హంగులతో పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ బివి.సత్యవతికి ధన్యవాదాలు తెలియజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ శాఖ గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్‌గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల క్రిష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తూరు రామారావు, బొడ్డు సోమరాజు, పూడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీని సత్యవతిని సత్కరిస్తున్న నాగభూషణం తదితరులు

ఎన్‌టిపిసిలో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

వినతిపత్రం ఇస్తున్న ముత్యాలు, చిత్రంలో సర్పంచ్ సుజాత

ప్రజాశక్తి-పరవాడ : ఎన్‌టిపిసి సింహాద్రిలో మత్స్యకారులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ఆ కంపెనీ జిఎంకు ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో సుమారు 12 వేలు మంది మత్స్యకారులు నివసిస్తున్నారని, వీరంతా చేపల వేట జీవనాధారంగా బతుకుతున్నారని తెలిపారు. ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన తరువాత ఉప్పుటేరులో ఎన్టీపీసీ పైపులైన్ల ద్వారా వ్యర్థ రసాయనాలు, ఫ్లయాష్ కలవడం వలన మత్స్య సంపద నశించిపోయిందని పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఎన్టీపీసీలో ఉద్యోగాలివ్వాలని 2011లో వారం రోజులు పాటు ధర్నా చేసిన నేపథ్యంలో నాటి కలెక్టర్ స్పందించి 60 మంది మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని ఎన్టీపీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. నాటి నుండి నేటికి 12 సంవత్సరాలైనా ఎన్టీపీసీలో మత్స్యకారులకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార నాయకులు, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రజిని, మత్స్యకారులు పాల్గొన్నారు.

రహదారి గోతులు పూడ్చరూ...

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం అచ్చెర్ల గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న గోతులను పూడ్చాలని సింగవరం, కొత్త అచ్చర్ల, మోసయ్యపేట, గోకివాని పాలెం, అచ్చర్ల గ్రామస్తులు కోరుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో పై గ్రామాలతో పాటు బుచ్చయ్యపేట, రావికమతం మండలాల ప్రజలు నిత్యం రాక పోకలు సాగిస్తూ ఉంటారు. వర్షం పడితే గొయ్యిలో పడి వాహనదారులు ప్రమాదం బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్కడక్కడ గోతుల్లో గ్రావెల్ మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ అవి యథాస్థితికి చేరుకున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు గోతులు పూడ్చాలని, శాశ్వత రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోతులతో అధ్వానంగా ఉన్న అచ్చర్ల రోడ్డు

బత్తులను కలిసిన దాడి రత్నాకర్

ప్రజాశక్తి- వడ్డాది : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబును బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని టిడిపి పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువ కప్పి, మెమొంటో అందచేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి రాజకీయాలపై చర్చించారు.

తహశీల్దారుతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అయేషా

తహశీల్దారు కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి ఆర్డీవో ఎస్.అయేషా మంగళవారం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వీఆర్వో, సచివాలయం సర్వేయర్లతో సమీక్ష నిర్వహించి మండలంలో రెవెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు రెవెన్యూ సమస్యలను గుర్తించి, పరిష్కరించే దిశగా పనిచేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహశీల్దార్ కె .అప్పారావు, ఆర్ఐ ఎన్. సతీష్ పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామంలో జరుగు 26వ దేవి నవరాత్రుల మహోత్సవం పోస్టర్‌ను మంగళవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు ఆవిష్కరణ చేశారు. గ్రామంలో జరుగు ఉత్సావల్లో పాల్గొవాలని వారు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ మరిసా సతీష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కోరుకొండ రవికుమార్, మరిసా నరేష్, దొండ రమేష్ పాలొన్నారు.

ఘనంగా బిఆర్‌బి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ సర్పంచ్, మాజీ ఎంపిటిసి బిఆర్‌బి నాయుడు జన్మదిన వేడుకలను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో ఘనంగా నిర్వహించారు. మండల నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాండ్రంకి అప్పలరాజు, మద్ది శేఖర్, గణేష్ పాల్గొన్నారు

ఘనంగా దుర్గమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడలో యంగ్ మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదుర్గ దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గ్రామ పురవీధులలో భవాని భక్తులు మేళతాళాలలతో అంగరంగ వైభవంగా అమ్మవారి జ్యోతి, సారె ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం భవానీలకు కమిటీ వారు ప్రత్యేక సద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు చుక్కా రాము నాయుడు, కమిటీ పెద్దలు రొంగలి అప్పలనాయుడు, పరవాడ జగదీష్, గండి సత్యనారాయణ, గండి శ్రీనివాసరావు, కసిరెడ్డి అప్పలరాజు, గండి సన్యాసిరావు, చుక్కా గోపి, ద్వారపూడి శ్రీనివాస్, గండి సురేష్, బొడ్డు బుజ్జి, రాజాన దివాకర్, బొడ్డు శ్రీధర్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డులో మరమ్మతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని బంగారు మెట్ట కూడలి నుంచి రావికమతం వరకు బిఎన్ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా చోడవరం నుండి కొత్తకోట వరకు బిఎన్ రోడ్డులో పెద్ద పెద్ద గొయ్యలు ఏర్పడి ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవారు. ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరడంతో వాహనాదారులు ప్రమాదలకు గురవుతున్నారు. దీంతో రెండు రోజులుగా బిఎన్ రోడ్డులో బంగారుమెట్ట జంక్షన్ నుండి రావికమతం వరకు జేసీబీలతో గుంతలను పూడ్చుతున్నారు.

జెసిబితో మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

రైతు సేవా కేంద్రాల ద్వారా

జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

జీడిపిక్కలకు సరైన మద్దతు ధర లేక జీడి రైతుల ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ జీడి రైతుల సంఘం కార్యదర్శి వనం సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కింతాడ గ్రామ సచివాలయ కార్యదర్శికి మంగళవారం వారు వినతిపత్రం అందించారు. అనంతరం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కింతాడ, కె.సంతపాలెం, ఆర్లే, మర్రివలస, సూదివలస, దాలివలస, పిండ్రంగి తదితర గ్రామాల్లో రైతులు జీడి తోటలు పెంచుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. జీడి పిక్కలు అతి తక్కువ ధరకు దళారులు కొనుగోలు చేసుకుని రైతులను మోసగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి జీడిపంట విస్తరణకు రాయితీలు పునరుద్ధరించాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరా జీడి తోట అభివృద్ధికి 94 వేల రూపాయలు క్షేత్రస్థాయిలో రైతులకు అందించాలన్నారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తా రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీడి రైతులు బండారు సీతాపాత్రుడు, ఎస్ ఆనందలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -భీమునిపట్నం

జివిఎంసి నాలుగోవార్డు కాపులుప్పాడ, నిడిగట్టు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి కెఎస్ఎన్ రెడ్డి అరటి మొక్కల సాగుపై రైతులకు సూచనలు చేశారు. హెక్టారు అరటిసాగుకు మొదటిఏడాది రూ.30వేలు, రెండో ఏడాది రూ.15వేలు పంటరాయితీ ప్రభుత్వం అందిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమిలి ఎఒ బి.శివకోమలి చిరుపొట్ట దశలో ఉన్న వరిపైరు సంరక్షణ, ఎరువుల యాజమాన్యంపై వివరించారు. తాళ్లవలస ప్రభుత్వ పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జి ప్రశాంతి పాడి రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎడిఎ భ్రమరాంబ, రైతు సేవా కేంద్రం సిబ్బంది స్రవంతి, వాసంతి, శివప్రసాద్ పాల్గొన్నారు

ఆనందపురం : మండలంలోని పేకేరు, శిర్లపాలెం, గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్ పాల్గొని సమీకృత వ్యవసాయ పద్ధతులపై వివరించారు. రెండో పంటగా కొత్త పోర్టిఫైడ్ రాగి వంగడాల సాగుద్వారా ఎకరానికి 15-18 క్వింటాళ్లు అధిక దిగుబడులు సాధించి, గిట్టుబాటు ధరను పొందవచ్చని వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటం, వరిపైర్లలో సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యతనను వివరించారు ఎఒ సంధ్యారత్నప్రభ, ఎన్ఎఫ్ఎ శ్రీనివాస చక్రవర్తి, బోని, వెల్లంకి అగ్రికల్చర్ అసిస్టెంట్లు దిలీప్ చక్రవర్తి, రమేష్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జి.భీమవరం, గైతులపాలెం (తాళ్ళపాలెం) గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి స్వప్న మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఇతర పంటలకు సంబంధించి తగు సూచనలు చేశారు. క్షేత్ర పరిశీలన చేసి వరి వరి పంటలో పొడ తెగులు, ఆకు ముడత పురుగు ఉధృతి గమనించి హెక్సా కొనజోల్, క్లోరిఫైరిఫాస్ మందును పిచికారి చేయాలని సూచించారు. బొప్పాయి, కాయగూరలు పంటలలో వచ్చు చీడపీడలు గూర్చి అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూక్ష్మ నీటిపారుదలకు సంబంధించి డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పైపులను రాయితీపై ఇవ్వడం జరుగుతుందని ఆ శాఖ ఏరియా కోఆర్డినేటర్ రంజిత తెలిపారు. కార్యక్రమంలో జి.భీమవరం గ్రామ సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు, ద్వారపురెడ్డి సత్తిబాబు, తురకలపూడి సూరిబాబు, ఎస్ఎం నాయుడు, ఉద్యాన సహాయకులు బుద్ధ కిషోర్, గ్రామ వ్యవసాయ సహాయకులు సన్యాసి నాయడు, కర్రి సత్య నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కశింకోట మండలం వ్యవసాయాధికారి స్వప్న

సచివాలయం సేవలపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటర్నషిప్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆసకపల్లి సచివాలయ సిబ్బంది సహకారంతో సచివాలయంలో పలు విభాగాలు, ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందే సేవా కార్యక్రమాలు విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ తిరుపతిరావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా జిసిడిఓ సందర్శించి తగు సూచనలు చేశారు.

మాడుగుల డాక్టర్ సుధాకరరావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి- వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో మాడుగుల డాక్టర్‌గా గుర్తింపు పొందిన సెయింట్ లుక్స్ క్లినిక్ వ్యవస్థాపకులు ప్రముఖ వైద్యులు కీర్తిశేషులు టిఎస్ఎస్ సుధాకర్‌రావు 85వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వడ్డాదిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు పాటల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సుధాకరరావు జిల్లాలోని అతి తక్కువ ఫీజుతో పలు రకాల ఆపరేషన్లు చేసేవారిని తెలిపారు. ప్రతి ఏడాది పేదలకు వస్త్రాలు దానం చేయడం వంటి సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పి వసంత కుమార్, సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు పాల్గొన్నారు.

సుధాకరరావు విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం

ఆర్థికసాయం అందజేస్తున్న సుభాష్

వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఆనందపురం : గుండె, కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న మండలంలో రేగానిగూడెం గ్రామానికి చెందిన రేగాని రామన్నకు మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మంగళవారం రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. సీఫుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రామన్నకు ఇటీవల గుండె, కిడ్నీలకు రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడంతో విజయనగరం శ్రీరామమూర్తి ఆసుపత్రిలో చేరాడు. రామన్న వైద్యానికి అధికమొత్తంలో డబ్బులు అవసరమౌతాయని వైద్యులు చెప్పడంతో విషయాన్ని తెలుసుకున్న ఘట్టమనేని సుభాష్ తనవంతుగా రూ.50వేలు ఆర్థికసాయాన్ని బాధితుని కుటుంబసభ్యులకు అందజేశారు మెరుగైన చికిత్స అందించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో బోస్, కుమార్‌స్వామి పాల్గొన్నారు

పండక్కి బకాయి జీతాలు ఇప్పించండి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు దసరా పండగలోగా ఇవ్వాలని డిసిహెచ్ శ్రీనివాస్‌కు కార్మికులు మంగళవారం విన్నపం చేశారు. ఎపి మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి 48వ రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలన్నారు. ఒక్కనెల ఇంటి అద్దె, కిరణా, అప్పులకు వడ్డీలు, పిల్లలు స్కూల్ ఫీజులు కట్టకపోతే సంబంధించిన యాజమాన్యాలు తమపై ఒత్తిడి చేస్తున్నారని, అలాంటిది మూడు నెలలు జీతాలు బకాయిలు ఉంటే ఏం తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన డిసిహెచ్ శ్రీనివాస్ సంబంధిత కాంట్రాక్టర్లును ఫోన్‌లో సంప్రదించి 10వ తేదీ లోగో బకాయి జీతాలు చెల్లించాలని ఆదేశించగా, కాంట్రాక్టర్లు ఒక్క నెల జీతం చెల్లించిస్తామని హామీ ఇచ్చారు. దీనికి కార్మికులు డిసిహెచ్‌కు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.సంతోష్, నూకరాజు, పోలరావు, సుధీర్, నారాయణ, అడవి రాజు, బిఎల్ రాజు, జగన్నాధరావు దేవి, వరలక్ష్మి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-సబ్బవరం : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ జిలాని బేగం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచకర్లకు ఆమె పూలగుచ్ఛం అందజేసి దుస్సాలువతో సత్కరించారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

గ్రానైట్ క్వారీ అనుమతులపై..

ప్రజాభిప్రాయ సేకరణ రద్దుచేయాలి

-జగనన్న రీ సర్వేలో రద్దయిన పాస్ బుక్‌లను పునరుద్ధరించాలి- కె.గదభపాలెం ఆదివాసీల ఆందోళన

నినాదాలు చేస్తున్న ఆదివాసీలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొట్నబిల్లి రెవెన్యూ పరిధిలో ఈ నెల 9న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.గదభపాలెం వాసులంతా మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్వే నంబర్ 1లో 3.219 హెక్టార్ల భూమిలో అశ్రిత ఎంటర్ప్రైజెస్ అనే సంస్థ క్వారీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుందన్నారు. ఈ గ్రామ పరిధిలో ఇప్పటికే 12 గ్రానైట్ క్వారీలు ఏర్పాటు చేశారని, 15 ఏళ్లవుతున్నా నేటికీ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. గ్రామాభివృద్ధికి కనీసం ఒక్క పైసా కూడా కేటాయించ లేదని, 2.30 కోట్లతో చినపాచిల కాటా నుంచి కొట్నబిల్లి మీదుగా టి.అర్జాపురం గ్రామానికి 2018లో ప్రధాన మంత్రి రోడ్ సడక్ యోజన పథకం కింద తారు రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఆ రోడ్లలో ఈ క్వారీలు ఉండటంతో భారీ లారీలతో మట్టి రోడ్డుగా మారిపోయాయన్నారు. చిన్నపాటి వర్షాలకు కూడా గోతులవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. క్వారీల్లో భారీ బాంబ్ బ్లాస్టింగ్లలతో రాత్రి వేళలో తమకు కంటిమీద కునుకు లేదని, క్వారీ ప్రభావిత ఏరియాలో మంచినీళ్ళు సైతం కలుషితమై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆదివాసీలకు తాగునీరందించాలని, జగనన్న రీ సర్వేలో రద్దయిన పాస్ బుక్‌లను వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధి కం సంఖ్యలో ఆదివాసి గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి చేస్తున్న నిరసన 48వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు ఎల్.వి. రమణ మాట్లాడుతూ, కార్మికులకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని కాంట్రాక్టర్లను అడిగితే ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని, తాము చెల్లించ లేమని చెపుతున్నారని వాపోయారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు కట్ట లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించి స్లే షిప్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నెల 16వ తేదీ లోపు సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మె తప్పదని, దీనికి అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతి, సత్యవతి, సోమేశ్వరరావు, లక్ష్మి, దుర్గా, లావణ్య పాల్గొన్నారు.

కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యం : పిఒ

ప్రజాశక్తి - చింతపల్లి:కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అన్నారు. కాఫీ రైతుల నుండి నాణ్యమైన కాఫీ పళ్ళను సేకరించాలని ఆదేశించారు. మంగళవారం చింతపల్లి కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, చింతపల్లి, జి కె వీధి, కొయ్యూరు మండలాల లైజన్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 నవంబర్ నెల నుండి కాఫీ సేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నాణ్యమైన కాఫీ పళ్ళు మాత్రమే సేకరించాలని ఆదేశించారు. 2 వేల టన్నుల కాఫీ పళ్ళను సేకరించడం లక్ష్యంగా నిర్దేశించామని స్పష్టం చేశారు. గత ఏడాది 836 టన్నుల కాఫీ పళ్ళు సేకరించి రైతులకు కేజీకి రూ.43లు చెల్లించడం జరిగిందని చెప్పారు. దానికి అదనంగా కిలో ఒక్కింటికి మూడు రూపాయల చొప్పున రైతులకు బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. గత ఏడాది 189 మెట్రిక్ టన్నుల పార్చ్మెంట్, 33 టన్నుల చెర్రీ ఉత్పత్తి జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,500 కాఫీ రైతులను గుర్తించడం జరిగిందన్నారు. అనంతగిరి మండలం నుండి 50 టన్నుల, అరకు వ్యాలీ, డుంబ్రిగూడ నుండి 120 టన్నులు, హుకుంపేట 200, పెదబయలు 120, ముంచంగిపుట్టు 100, పాడేరు 120, జి మాడుగుల 350, చింతపల్లి 400 మెట్రిక్ టన్నుల కాఫీని సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్ , మ్యాక్స్ సొసైటీ అధ్యక్షులు సిగ్గే కొండలరావు, ఉపాధ్యక్షులు గాం సింహాచలం పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను సప్పరం వాహనంలో గ్రామ తిరు సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

అవగాహన కల్పిస్తున్న ఎఒ

పంటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు, పుత్తడిగైరంపేట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుధారాణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి పంటను ఆశించే తెగులు, చీడ పీడలు ముఖ్యంగా ఆకుముడత నివారణపై వివరించారు. క్షేత్ర సందర్శన చేసి పోటాష్ ఎరువు వాడకంపై తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నేల ఆరోగ్యం, కాషాయల పద్ధతి గురించి వివరించారు. .ఉద్యాన పంటల పథకాలు, పంటలకి వచ్చే తెగుళ్లపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమంను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఆఫీసర్

పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

చాపరాయిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రం చాపరాయి జల విహారిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌వెస్ట్ రవినాథ్ తిల్హరి కుటుంబ సభ్యులతో మంగళవారం సందర్శించారు. జల విహారిలో సందర్శించిన ఆయనకు గిరిజన సంప్రదాయ నృత్యంతో గిరి మహిళలు స్వాగతం పలికారు. జల విహారిలో సరదాగా స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, పచ్చని అందాలను చూసిన ఆయన మంత్రముగ్ధులయ్యారు.

తాగునీటి సమస్యపై సిపిఎం నేతల నిరసన

ప్రజాశక్తి -చీడికాడ:గత ఆరు నెలల నుండి తాగడానికి నీరు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని సిపిఎం నాయకులు, గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. చీడికాడ మండలంలో కోనాం పంచాయతీ కొండ్ల కొత్తూరు గిరిజన గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ, ఈ గ్రామంలో ఆరు నెలల నుండి తాగునీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదన్నారు. సంవత్సరం క్రిందట వరకు చిన్న కోణం గ్రామం వాటర్ ట్యాంక్ నుండి కుళాయి నీరు సరఫరా అయ్యేదని, కొత్త ట్యాంకు మంజూరు పేరుతో ఈ గ్రామానికి పూర్తిగా తాగునీరు అధికారులు ఇవ్వలేదన్నారు. కొత్త ట్యాంక్ నిర్మాణం కోసం మోటార్ బోర్ ఏర్పాటు చేశారని, దాని నుండి కూడా తాగునీరు ఇవ్వలేదన్నారు. గ్రామస్తులు కిలోమీటర్ దూరంలో గెడ్డలో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభల్లో అనేకమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కే కన్నబాబు, సాయికుమార్, రాము, సన్నిబాబు, ఎం.రాజు, పైడమ్మ, సన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, మహిళలు

పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-గొలుగొండ: పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కే.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో సిపిఎం మండల కమిటీ సమావేశం కామ్రేడ్ సాపిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ, గొలుగొండ మండలంలో బంజర, ఇనాం, ఇతర ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి సాగులో ఉన్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టే సర్వేలో సాగులో ఉన్న పేదల పేరున సర్వే చేసి రికార్డులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేదల భూమలు అక్రమదారులకు అగమేఘాలపై రికార్డులో మారుతున్నా పేదల వరకు వచ్చేసరికి ఆ పని జరగలేదని విమర్శించారు.

సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యావసరాల సరకుల ధరలు ఆకాశానికి అంటాయన్నారు. ధరలను అరికట్టకపోతే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడతారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు అడిగర్ల రాజు, శివ, బాలరాజు, బెన్నేష్, జోగిరాజు, కన్నబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

న్యాయంపూడిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని న్యాయంపూడి గ్రామంలో మంగళవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిమ్ బోత్కర్‌లు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు ఎస్ హెచ్‌జి సభ్యులకు ఏ విధంగా జీవనోపాధి అవసరాలకు ఉపయోగ పడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలతో పలు అంశాలపై చర్చించారు. వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సచిదేవి, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డైజీ, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఏపీవో భాగ్యలత, పంచాయతీ కార్యదర్శి నరసింహారాజు, డిపిఎం శ్రీనివాస్, ఎసి సత్యవేణి, ఏపిఎం శ్రీనివాసరావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్ననరసింహారావు

జాతీయస్థాయి యోగా పోటీల్లో
గోల్డ్ మెడల్ సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు జాతీయస్థాయి యోగా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 2 నుండి 5వ తేదీ వరకు ఎల్.పి సావని అకాడమీ, సూరత్, గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో జి.ఎస్.ఎస్ చరణ్, పి.సోహన్ శ్రీ, బి. దేవాన్ష్ నాయుడు, సిహెచ్.జయదీప్, వి.చైతన్య బృందం ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. తమ విద్యాసంస్థల నందు చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు ఇతర రంగాల్లో ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థుల అంకితభావంతో కూడిన నిరంతర కఠినమైన సాధన ఈ ఘన విజయానికి కారణమన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను, యోగా గురువులు డి.సురేష్, జయంతిలను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, తల్లిదండ్రులు అభినందించారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని గింజర్తిలో అంబేద్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) గ్రామ కమిటీ, బీమ్ ఆర్మీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహన్ని ఎయిమ్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.అప్పారావు, విగ్రహాదాత, ఏయిమ్ మండల కోకన్వీనర్ చిట్టిమూరు శ్రీనుబాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కె.చినదేముడు, జిల్లా ఉపాధ్యక్షులు నేతల బోగేష్, డికెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.చలపతిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. భారతదేశానికీ రాజ్యాంగాన్ని అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలు అందరూ పాటించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయిమ్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఎస్.వీరబాబు, గొలుగొండ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, సీనియర్ దళిత నాయకులు నాగేశ్వరరావు, కాపారపు అప్పారావు, మండల అధ్యక్షులు సిహెచ్. అప్పారావు, జిల్లా కొ కన్వీనర్స్ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ఆడుతున్న క్రీడాకారులు

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో దసరాను పురస్కరించుకొని ఫుట్ బాల్ పోటీలు నిర్వహించారు. మూడు రోజులు పాటు సాగే ఈ పోటీలను సోమవారం రాత్రి ప్రారంభించగా మంగళవారం కొనసాగాయి. పోటీలను చూసేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గెలుపొందిన వారికి దసరాకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

జిల్లాలో పల్లె పండగ వారోత్సవాలకు ప్రణాళిక

-విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్టణం జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ' వారోత్సవాలను ప్రణాళికాయుతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. రూ.29.04 కోట్ల అంచనా వ్యయంతో గ్రామీణ మండలాల పరిధిలో 322 పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. లేబర్ బడ్జెట్ కూడా రూపొందించుకున్నామని, దాని ప్రకారం పనులను చేపడతామని వివరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న పల్లె పండగ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. విశాఖ జిల్లా కలెక్టరేట్ నుంచి కార్యక్రమంలో భాగస్వామ్యమైన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టదలచుకున్న పనుల గురించి డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్రామ సభల ద్వారా 322 పనులను గుర్తించామని చెప్పారు. రూ.24.09 కోట్లతో చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.21.09 కోట్ల బడ్జెట్ అంచనాలను ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేశామని మిగిలిన వివరాలను త్వరితగతిన నివేదిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులకు పల్లె పండగ కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించామని, అందరినీ సంసిద్ధం చేశామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సంక్రాంతి నాటికి అన్ని పనులను పూర్తి చేస్తామన్నారు. పనుల నిర్వహణకు సంబంధించి అవసరమైన మడిసరుకును, పరికరాలను సమకూర్చుకుంటున్నామని వివరించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను పక్క జిల్లాల నుంచి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విశాఖపట్టణం జిల్లాకు తూర్పుగోదావరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలో 27 అదనపు రీచ్‌లు కేటాయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, డిపిఒ శ్రీనివాసరావు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన కీర్తిశేషులు పతివాడ చిన్నం నాయుడు కుమారుడు ధనుంజయనా యుడు ఆధ్వర్యంలోశ్రీ వెంకటేశ్వర పుష్ప గిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో మేడివాడ గ్రామంలో పంచాయతీ కార్యాలయం సమీపంలో కల్యాణ మండపం వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 120మంది రోగులు హాజరయ్యారు. వచ్చిన రోగులకు ఆప్తాలామిక్ ఆఫీసర్ రమణ, అసిస్టెంట్ మధుశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. 35మందికి ఆపరేషన్ నిమిత్తం విజయనగరం తరలించారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

రోడ్డును పరిశీలిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో లక్ష్మిపేట పంచాయతీ కొదువలస గ్రామానికి పిఎం, జన్మాన్ ఆవాస్ యోజన్ పథకం కింద తారు రోడ్డు నిర్మాణం వెంటనే చెయ్యాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. పెదబయలు మండలం లక్ష్మీ పేట పంచాయతీ కొదువలస పీవీటీజీ గ్రామానికి పిఎం జన్మన్ యోజన పథకంలో పివిటిజిలందరికీ ఇల్లులు, గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కొదువలస గ్రామంలో కొర్ర నర్సయ్య అధ్యక్షన జరిగిన సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, కొదువలస గ్రామ రోడ్డు తుపాన్‌కు కొట్టుకు పోయినదని, దీంతో అంబులెన్సు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామానికి నిత్యావసర వస్తువులు తీసుకుని వెళ్ళలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె.సర్బన్న, నాగేష్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ నవలా రచయిత, స్వాతంత్ర సమరయోధుడు బహుముఖ ప్రజ్ఞాశాలి కులపతి అడివి బాపిరాజు 129వ జయంతిని మంగళవారం బీచ్ రోడ్‌లోని విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి అడివి బాపిరాజు మెమోరియల్ ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సన్ మూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సన్ మూర్తి మాట్లాడుతూ, 1895 అక్టోబర్ 8న జన్మించిన వ్యక్తి కులపతి అడివి బాపిరాజు జీవితాన్ని కావ్యంగా మలుచుకున్నారని కొనియాడారు. న్యాయ కోవిదునిగా, సినీ ఆర్ట్ డైరెక్టర్‌గా, చిత్రకారునిగా ప్రముఖ నవలా రచయితగా ఆయన సేవలు అమోఘం అన్నారు. తెలుగు సాహిత్య రంగంలో ఎనలేని కృషిచేసిన ఆయన నేటితరం కళాకారులకు, కవులకు ఆదర్శప్రాయం అన్నారు. అడివి బాపిరాజు ట్రస్ట్ ద్వారా వృద్ధులైన వారికి సేవలందించేందుకు వృద్ధాశ్రమాన్ని, ఆయన రచనలతో పాటు ఇతర తెలుగు కవుల రచనలను ప్రపంచానికి చాటి చెప్పే దిశలో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడానికి తాము ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబ్జి, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పాలసీని మార్చండి

ప్రజాశక్తి -చింతపల్లి: మద్యం పాలసీని మార్చి పేద, మధ్య తరగతి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, నూతన మద్యం విధానం బడా బాబుల జీవితాలకు వరం గానూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు శాపం కానుందన్నారు. తక్కువ ధరలో మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు.